# 5 వ కథ.

# "సుబ్బారాయుచరితం"

*

"దీన్నిగురించి వేరే చెప్పవలసినదేమీ లేదుకానీ-
ఇదిమాత్రం హాస్యరసభరితం"

*

నాంది ...

'ఒకరికి హాని కలిగేదయినా- పదిమందికి మేలు కలిగే పని చేయమంటారుట'- పెద్దలు. ఈవిషయం నాకు మొన్నటి వరకూ తెలియదు- కానీ నిన్నసాయంత్రం- పబ్లిక్ పార్కులో ఒక పెద్దమనిషి మరొక పెద్దమనిషి జేబులోంచి డబ్బు తస్క-రించి- దాన్ని అక్కడే ఉన్న ముష్టివాళ్ళకు పంచిపెట్టేశాడు. "అదేమిటయ్యా" అని డబ్బు పోగొట్టుకున్న పెద్దమనిషి అడిగితే- నేను పైన వ్రాసిన సూక్తిరత్నాన్ని ఉపయోగించి చిరునవ్వుతో వెళ్ళిపోయాడు. డబ్బు పంచిపెట్టిన పెద్దమనిషి మా అందరితోబాటూ- అక్కడున్న పోలీసులు సైతం ఆశ్చర్యపడక తప్పలేదు.

కనుక నామిత్రబృందంలో ఒకడైన సుబ్బారావు (నామకరణంనాడు పెట్టినపేరు- వీరవెంకటసత్యవరాహసుబ్రహ్మణ్యం- స్కూలుఫైనలు రిజిష్టరులో వేయించుకున్న పేరు వీరవెంకటసుబ్బారావు. మా మిత్రబృందానికి మాత్రం ఉత్తి సుబ్బారావు- కొండొకచో- సుబ్బారాయుడు) గురించి ఇక్కడ వ్రాస్తున్నందుకు అతనికి బాధే కలిగినా- పాఠకులు చాలామందికి కాలక్షేపం కావచ్చుననే అనుకుంటున్నాను...

కథాప్రారంభం —

పాతికసంవత్సరాలయినా పయిబడని పాలబుగ్గల పాపడు మా సుబ్బారావు! "నేను బ్రతికుండగా బి. ఎ. ప్యాసు కాగలనా? బి. ఎ. ప్యాసు కాగలనా?" అనే చింతతో మంచం పట్టినవాడ్ని— "నీకు పట్టా ఎందుకులే— చక్కని పిల్లను కట్టిబెడతాను— లే"— అంటూ వాళ్ళ నాన్నగారు— మందులు వాడకుండానే మంచం మీదనుండి లేవదీశారు. కానీ ఏజన్మలో ఏ అమ్మాయికి అన్యాయం చేశాడో— ఈజన్మలో సుబ్బారావుకి అన్నివిధాలా అనుకూలవతి అయిన అమ్మాయి దొరకటం దుర్లభమయిపోతోంది... ఇక వాళ్ళ నాన్నగారే ఎదురువెళ్ళి— 'మీ అమ్మాయిని మా అబ్బాయికిస్తే— కన్యాశుల్కం ఇస్తామనీ, పిల్ల పేర మేడ కట్టిస్తామనీ, పొలం రాస్తామనీ'— దేవుళ్ళాడటం మొదలుపెట్టినట్లుగా— మా మిత్రమండలి తీసిన భోగట్టా.

తెల్లని నున్నని శరీరంమీద నిగనిగలాడుతూ మెరసిపోయే "షార్క్‌స్కిన్" షర్టు మావాడికి ప్రత్యేక అలంకరణ. సన్నగానూ, మరీ చిన్నగానూ మీసాలను కత్తిరించడంలో వాడికి వాడే సాటి! నవ్వినపుడు బయటపడే తెల్లని పలువరస ఆనల్లని మీసాలకు జోడై— చూసేవారికి పెసరట్టూ ఉప్మాల జోడింపులా కనిపిస్తూంటుంది.

దినచర్య—

చీకటితోనే లేవటం మంచిది కాదనీ, ఆసమయంలో మనుషులు పొడుగెదుగుతారని, అదోరకమైన ఘట్టివిశ్వాసం సుబ్బారావుకు. అందుకనే తెలుగులో వార్తలు పూర్తయ్యే వరకూ నిద్రనుంచి లేచినా పడకమీదనుంచి లేవడు.

"కోతిమార్కు నల్ల పండ్లపొడి" వాడితే పళ్లు తెల్లబడతాయని ఎవరు చెప్పిపెట్టారోకానీ- వాళ్ళ నాన్న "బినాకా" టూత్ పేస్టు కొని తెచ్చినా వద్దని వాపసుచేయించి ఆ నల్లపండ్లపొడినే వాడుతున్నాడు చాలాకాలంనుంచీ ! అందుకనే వాడిపళ్లు అంత తెల్లగా వుంటాయి.

ఉదాహరణ:- ఒక అమావాస్యనాటి రాత్రి మావాడు రెండవ ఆట సినిమా చూసి వస్తూవుంటే సిటీకరెంటు ఆగిపోయిందట. ప్రక్కనున్న మిత్రబృందం (ఆరోజు నేను లేను లెండి) 'అయ్యో' అని ఒకరూ- 'అలో లక్ష్మణా' అని మరిఒకరూ- దారికానక ఆక్రోసిస్తూంటే-

సినిమాలో హీరోయిన్ను- విలన్ బలాత్కరిస్తూంటే ఏకిటికీలోంచో- హీరో లోపలకు దూరి- కత్తో లేక పిస్తోలో చూపించి ఆఘూ ! అని అరచినట్లుగా-

నల్లని మేఘాలసందోహపు చీకటిని చీల్చుకొని కాంతివంతమయిన మెరపు మెరసినట్లుగా-

కథా నిలయం
913



మావాడు తన పెదాలమధ్యనుండి- చిన్నగా నవ్వాడట. మెరసిపోయే ఆ తెల్లని పళ్ళకాంతిలో మిత్రబృందానికి దారి కనిపించిందట. ఇది నేను నమ్మలేదు. కనుక- మిమ్మల్ని నమ్మమని నేను వెుహమాట పెట్టదల్చుకోలేదు.

ఇక వుదయం ఎనిమిదిగంటలయ్యేసరికల్లా-కాలకృత్యాలు ముగించుకొని, రేడియో సిలన్‌నుంచి వచ్చే హిందీ పాటలు వినటానికి కాఫీహోటల్ చేరుకుంటాడు. అక్కడ ఆపాటలు విని వచ్చి ఇంట్లో తలుపులు మూసుకోనకుండానే- తాను పాడటం మొదలుపెడతాడు. అమాంతంగా విచారకరమైన ఒకపాటను మొదలుపెట్టి- మధ్యలో ఆపుచేసి అచ్చంగా సైగల్ పాడినట్లే వుందే! అనుకొని, గర్వంతో చుట్టూ ఒకసారి చూస్తాడు. సైగల్ పాడిన "సోజా! రాజకుమారీ!" అనే పాటంటే పడి ఛస్తాడు సుబ్బారావు. మరోవిశేషమేమిటంటే వచనాన్ని పాటగానూ- పాటల్ని వచనంగానూ చదవటం సుబ్బారావు హాబీ!

సాయంత్రం నాలుగంటలయ్యేసరికల్లా- హాయిగా చల్ల (పిల్ల) గాలి కోసం- నీటుగా తయారై, తెల్లని బట్టల మెరపులతో- మహిళాసంఘపువీథిలోనుంచి నడచిపోతుంటే- కాలక్షేపంకోసం వీథుల్లో నిలుచున్న ఒకటీ- అరా అమ్మాయిలుకూడా లోపలకు వెళ్లిపోతారు- తెలుగుసినీమాలో

హీరోలా తాను వాళ్ళకేసి చూడగానే డబ్బింగు సినిమాల్లో విలన్‌ను చూచిన హీరోయిన్‌లా_

'లోపలకు ఎందుకుపోతారో? తనలో లోపం ఏమున్నదో? లేక పూర్వజన్మపాపమో ?' అనుకొని అరనిమిషంపాటు బాధపడినా_ "ఏమో ? ఇంతమగవాణ్ణి_ అందులోనూ అందగాణ్ణి_ చూసి సిగ్గుపడి_ లోపలకు పోవచ్చుగా!" అని తనకు తానే సమాధానపరచుకుంటాడు.

ఆవిధంగా తిరిగి తిరిగి రాత్రి ఏ తొమ్మిదిగంటలకో ఇంటికి చేరుకొంటాడు. భోజనముకాగానే_ వాకింగ్ చేయటం కన్న_ కాస్త లిటరేచర్ చదివితే మంచిదనే నమ్మకంతో శవసాహిత్యం తెగచదువుతాడు, మావాడిలోని మరోప్రత్యేకత ఏమిటంటే_ తాను గాఢనిద్రపోతూ_ తనకలవరింతలతో_ పక్కనున్నవాళ్ళను నిద్రపోనీయడు! అదైనా భరించవచ్చునేమో? కానీ ఒక్కొక్కరోజు నిద్రపోతూనే లేచి నడుస్తాడు! పరుగెత్తుతాడు! పాటలు పాడుతాడు, ఇంకా గోడలతో మాట్లాడుతాడు.

ఒకసారి పరీక్షలకోసం మామిత్రమండలి అంతా రూమ్ తీసుకొని రాత్రింబవళ్ళు చదవటం మొదలుపెట్టిన రోజుల్లో_ ఒకరాత్రి సుమారు రెండుగంటలవేళ_ "సావిత్రీ! సావిత్రీ!" అనే కేకలు వినిపించి_ లేచి చూశాను! ఇంకే

ముంది? సుబ్బారావు ప్రక్కమీదలేడు. గబగబా అడ్డువచ్చిన వన్నీ తన్నుకుంటూ- నిద్దరోతూనే ఆగదిలో నడచేస్తున్నాడు. నన్ను కౌగలించుకోబోయిన సుబ్బారావుని గట్టిగా పట్టుకొని సంగతేమిటిరా ? అన్నాను. వాడు కళ్ళు తెరవకుండగనే “అందానికి మారుపేరు సావిత్రి అనీ అంతకిత్రంరోజు కాలేజీలో కనిపించిందనీ ”- మొదలుపెట్టాడు .. తరచుగా వచ్చే ఈజబ్బుగురించి డాక్టరుగారికి చెప్పి మందు ఇప్పించాం మేమంతా !

ఆశలూ- ఆశయాలూ।

మా సుబ్బారావుకుకూడ అందరిలాగే ఆశలూ- ఆశయాలూ వున్నాయి... భవిష్యత్తుకు నిచ్చెనలు వేస్తూనే అసలు కొంత భవిష్యత్తును పాడుచేసుకున్నాడు పాపం ! బి. ఎ. చదివే రోజుల్లో- అది ప్యాసు కాగానే ప్లీడరీ చదివి లాయరుపట్టా పుచ్చుకొని, సంఘంలో మగవారివల్ల మోసపోయే ఆడజాతిని ఉద్ధరించి- ఆంధ్రలో పెద్దపేరు సంపాదించి- వీరేశలింగం అంతటివాడు కావా లనుకున్నాడు- కానీ- ఆ బి. ఎ. పరీక్ష కాస్త పోవటంతో ముందు నీరుకారిపోయాడు. కానీ తర్వాత ‘‘తనపేపర్లు దిద్దటానికికూడా ‘స్టాండర్డు’ ఉన్న వాళ్ళు కావాలని- బొత్తిగా భాషాపరిజ్ఞానం లేనివాళ్ళు పేపర్లు దిద్దటంవల్లనే తనుబాసు పేపరులో పసలేదని- సంతృప్తిపడి

ప్లీడరు కావాలనే తన కోరికను బలవంతంగా చంపుకున్నాడు. ఇలాగే తాను ఆశించినవి ఏమీ కాకపోవటంతో- హాయిగా ఏ వెనుకబడినజాతిలోనైనా పుట్టివుంటే- ప్రభుత్వం తనను అన్నింటా ఆదుకునేదికదా”- అని వాపోయేవాడు.

“తనజీవితంలో వివాహాన్నీ (అంటే భార్యనూ) ఉద్యోగాన్నీ- కళ్ళ చూడగలుగుతానా” అనే చింతకలిగినపుడు- రెండుపూట్ల భోజనం- అయిదుసార్లు కాఫీ ఒకసారి సిగరెట్టూ మానేసి- తలదువ్వుకోవటం మానేసి- దుప్పటి కప్పుకొని వంటగదిలోవుండే వాళ్ళ అమ్మ కెదురుగా పడకవేసి గంటకొకసారి టెంపరేచర్ రైజు కాకపోతుందా? అనే ధీమాతో- జ్వరంచూసుకోవటం మొదలుపెడతాడు. లేకలేక జన్మించిన వరపుత్రుడుకనుక- ఎంతో గారంతో చూసుకొనే- వాడి తల్లిదండ్రులు- కొడుకు ఏమైపోతాడో అనే బెంగతో మొక్కులు మొక్కుతూ- వాడి మంచంచుట్టూ పడిగాపులు కాస్తారు పాపం! ఒకసారి ఎప్పుడో అలాగే మంచంపట్టిన సుబ్బారావు “అమ్మా! ఎందుకయినా మంచిది- నన్ను వీధిలో పడుకోబెట్టెయ్యండే!” అన్నాడట- వాళ్ళ అమ్మా నాన్నా భోరుమని ఏడిచేశారట. ఆ ఏడుపుకు ఇంటిమీద పెంకులుకూడ లేచి- తమవిచారాన్ని వ్యక్తంచేశాయట! ఈవిషయం వాడే చెప్పాడు.

ఇలాగే- తన పాతికసంవత్సరాలలోనూ ఎన్నో 'ఎడ్వెంచర్సు' చేసిన మావాడి అనుభవాలు ఎన్ని వ్రాసినా మీరు చదవగలరు... కానీ కొన్నికొన్ని విషయాలు మావాడికోరికమీద వ్రాయటం మానేయవలసివచ్చింది.

ఉద్యోగం పురుషలక్షణం కనుకనూ- అది లేకపోతే బెంగతో- కొడుకు ఏమైపోతాడో అనే భయముతోనూ- వాళ్ళనాన్న ఉద్యోగం ఎలాగూ దొరకదుకనుక బ్రిహ్మాండమైన ఫాన్సీషాపు ఒకటి పెట్టించాడు. కానీ అందులోవున్న సామాన్లు ఆడవాళ్ళకు ఒకధరకు మగవారికి మరోధరకు అమ్మేవాడు సుబ్బారావు... మేమంతా అనుకున్నవిధంగానే- అది పున్నమినాటి చంద్రునిలా కాకుండా దినదినానికీ క్షీణించిపోతూ- అనతికాలంలోనే తదియనాటి చంద్రునిలా అయిపోయింది వాడి వ్యాపారం! "ఇక ఆషాపుమీద లాభంరాదు" అనే మంచి ఆలోచన మావాడిలో ఉదయించిన శుభముహూర్తాన- మాఅందరికీ- ఆషాపులోనే పెద్దటీ పార్టీ ఏర్పాటుచేసి, అందులో మిగిలిపోయిన టూత్ పేస్టులూ- పౌడరుడబ్బాలూ- సినీతారల కేలండర్లూ- మాఅందరకూ పంచిపెట్టేశాడు. వాడి ఔదార్యానికి- అక్కడే మెచ్చుకొని- కలకాలం అలాగే జీవించమని- దీవించారు మిత్రులు...

ఫాన్సీషాపు వెలగబెట్టిన తరువాత మావాడు- నాలుగు నెలలుకాబోలు- 'సినీమా రిప్రజెంటేటివ్' గా పనిచేశాడు

సినిమాహాలుదగ్గర గేటులోనుంచుని, వచ్చే ఆడవారిలో- తనకు నచ్చే చాలామందిని- టికెట్ తీయకుండగనే- లోపలకు పంపేశేవాడు. అటువంటప్పుడు ఆ ఉద్యోగం నాలుగు నెలల దాకా నిలబడిందంటే- మావాడి అదృష్టమనే చెప్పుకోవాలి!

ఇంతకీ ఆఖర్న చెప్పవలసిన దేమిటంటే- మా సుబ్బారావు- ఈమధ్య పెద్దమనిషిలాగా, నిండుకుండలాగా, గంభీరంగా మాట్లాడటం, లైబ్రరీకి వెళ్లి పేపరు తిరగెయ్యటం, సిగరెట్లు మానెయ్యటం- నేర్చుకుంటున్నాడు. మమ్మల్ని కలుసుకోవటం చాలావరకూ తగ్గించేశాడు. ఎప్పుడయినా కలుసుకున్నా 'పాకిస్తాన్ దురాక్రమణ' గురించో- 'శాస్త్రి గారి అమెరికాపర్యటన' గురించో నిశితంగా విమర్శిస్తాడు. ఏదిఏమైనా వాడిగురించి- ఈమధ్య ఎక్కువగా వివరాలు అందటంలేదు- కానీ మరొక మిత్రుడికి నాలుగురోజులక్రితమే సినిమాహాలులో కనిపించాడట! "ఏంచేస్తున్నావోయ్?" అని అడిగితే సమాధానంగా ఖాళీగా నేవుంటున్నట్లూ- ఉద్యోగంమీద ఆశ వదలుకున్నట్లూ- ఎవరయినా పిలచి- పిల్లనిచ్చి- పెళ్ళంటూ చేస్తే, ఎక్కువకట్నం (బహుమతి) తీసుకొని- దానికి తోడు మరికొంత కలిపి- సత్యజిత్ రాయ్‌తో కలసి- ఒకపిక్చర్ తీయాలనుకుంటున్నట్లూ- చెప్పాడట.

"పాపం! 'ఈ పట్టింపు' కయినా వాడికి భగవంతుడు సహాయపడితే సంతోషిద్దాం!"



---